

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నివాసం వద్ద బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేస్తున్న పోలీసులు


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 14 సెప్టెంబర్ 2024 | HYDERABAD




ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు నివాసం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలను మేడ్చల్ పీఎస్‌కు తరలిస్తున్న పోలీసులు

# నిర్బంధకాండ

## ఎమర్జెన్సీ రోజులు తలపించేలా..

- తెల్లవారుజామునే మోహరించిన పోలీసు బలగాలు
- ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు.. గృహ నిర్బంధాలు..
- భగ్గుమన్న గులాబీదళం.. వెల్లువెత్తిన నిరసనగళం
- ప్రభుత్వ తీరును ఎండగట్టిన బీఆర్ఎస్ నాయకులు
- ఇలాంటి నిర్బంధాలు ఉద్యమ సమయంలోనూ చూడలేదన్న తెలంగాణవాదులు

సిటీబ్యూరో/మేడ్చల్ సెప్టెంబర్ 13 ( నమస్తే తెలంగాణ ):'ఇందిరమ్మ రాజ్యం'లో ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెచ్చేలా శుక్రవారం తెల్లవారుజాము నుంచే బీఆర్ఎస్ ముఖ్యనేతలు, కార్యకర్తల ముందస్తు అక్రమ అరెస్టులు.. గృహనిర్బంధాలతో గ్రేటర్‌లో పోలీసుల నిర్బంధకాండ కొనసాగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులు చేసిన దాడికి నిరసనగా 'బీఆర్ఎస్' చేపట్టిన కార్యాచరణను భగ్నం చేస్తూ..అపార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలను ఎక్కడికక్కడే నిర్బంధించి.. పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. అరెస్టులపై ఆగ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు పలు చోట్ల నిరసనలకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వ దమననీతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు నిర్బంధాలు, అరెస్టులు కొత్తేమీ కాదని ఎలుగెత్తారు. ఇలాంటి నిర్బంధాలు ఉద్యమ సమయంలోనూ చూడలేదని తెలంగాణవాదులు పేర్కొన్నారు. అలాగే గ్రేటర్ పరిధిలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ముందస్తు అరెస్టులతో వారిని బయటకు వెళ్లనీయకుండా భారీగా బలగాలను మోహరించారు. ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు గౌడ్, చామకూర మల్లారెడ్డి, వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డిలను వారి ఇండ్ల వద్దే నిర్బంధించారు. అలాగే బీఆర్ఎస్ కార్పొరేటర్లు జగన్, మీనా ఉపేందర్‌రెడ్డి, లావణ్యాశ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకటరెడ్డి, వెల్దండ వెంకటేశ్, దేదీప్య, ప్రసన్నలక్ష్మి, హేమ , శైలజ, సునీత, గీతాప్రవీణ్ ముదిరాజ్, శాంతిసాయిజెన్ శేఖర్, దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్‌లను అరెస్టు చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

### రౌడీల్లా వ్యవహరిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీలను ఇవ్వలేకనే దౌర్జన్యాలకు పాల్పడుతున్నది. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేస్తుంటే పోలీసు వ్యవస్థ ఏం చేస్తున్నది. కాంగ్రెస్ పాలన గాడి తప్పింది. ప్రజలు గమనిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారు. – మాజీ మంత్రి మల్లారెడ్డి



## సాలె పురుగులు.. బొద్దింకలు..

### పలు హోటళ్లలో 'ఫుడ్ సేఫ్టీ' తనిఖీలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ ): పీర్జాదీగూడలోని పలు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అమరావతి హోటల్‌లో ఫ్రిజ్‌లో ఉన్న ఆహార పదార్థాలు లేబుల్స్ లేకుండా ఉండటం, ఆహారంలో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు తేలింది. వర్కర్లు ఎలాంటి గ్లోవ్స్, హెయిర్ క్యాప్స్ ధరించలేదని తేల్చారు. పార్కు బేకర్స్‌లో వంట గది గోడలపై సాలె పురుగులు, బొద్దింకలు ఉండటాన్ని గుర్తించారు.



మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి వద్ద ఉద్రిక్తత

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి వద్ద ఉదయం నుంచే ఉద్రిక్తత ఏర్పడింది. శంభీపూర్ రాజు ఇంటి నుంచే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నివాసంలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు చేరుకున్నారు. దీంతో పోలీసులు శంభీపూర్ రాజు ఇంటికి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బయటకు రాకుండా హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు



పోలీసుల తోపులాటలో మాజీ మంత్రి హరీశ్‌రావు గాయపడగా, కోకాపేటలోని తన నివాసం వద్ద చేతి నొప్పితో వైద్యశాలకు వెళ్తానంటున్నా.. అనుమతించకుండా కారుకు అడ్డుగా నిల్చున్న పోలీస్ అధికారి



శంభీపూర్‌లో గృహ నిర్బంధంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

## 17,18న మద్యం బంద్




సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో రెండ్రోజుల పాటు మద్యం షాపులు, కల్లు దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 17న ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

## నిమజ్జనోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- శాంతియుతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు
- సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 ( నమస్తే తెలంగాణ ) : గణేశ్ నిమజ్జనోత్సవం శాంతియుత వాతావరణంలో విజయవంతమయ్యేలా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిమజ్జనం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ అనుదీప్, నగర సీపీ సీవీ ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 17న నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగేలా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనంలో ఎక్కడైనా సమస్యలుంటే పోలీసు, రెవెన్యూ శాఖలకు తక్షణమే సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిటీ సీపీ ఆనంద్ మాట్లాడుతూ.. నిమజ్జన వేడుకల్లో 15 వేల మంది, ఇతర జిల్లాల నుంచి 3 వేల మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. మరో 8వేల మంది విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సీపీ సీవీ ఆనంద్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### 18వేల మందితో పటిష్ట బందోబస్తు..

హైకోర్టు ఆదేశాలతో ట్యాంక్‌బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతించకుండా పోలీసులు నెక్లెస్‌రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ వైపునే ఏర్పాట్లు చేస్తున్నారు. గణేశ్ శోభాయాత్ర సాఫీగా నిర్వహించడంలో భాగంగా ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ జోన్ల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. నిమజ్జనానికి 18 వేల మందితో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంతో పాటు రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నుంచి ట్యాంక్‌బండ్‌కు గతంలో భారీ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చేవి. అయితే హైకోర్టు ఆదేశాలతో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాలను నిమజ్జనానికి పోలీసులు ఎంట్రీ ఇవ్వకుండా నెక్లెస్‌రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ వైపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

### సాఫీగా వాహనాలు వెళ్లేలా..

నిమజ్జనం రోజు ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ఆ విభాగం చర్యలు చేపట్టింది. ఏఏ రూట్లలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్తాయనే విషయంపై అధికారులు జాబితా తయారు చేస్తున్నారు. శోభాయాత్ర రోజు మధ్యాహ్నం నుంచి నిమజ్జనాలకు తరలివచ్చే వాహనాల సంఖ్య పెరుగుతూ.. రాత్రి వరకు భారీ సంఖ్యలో వచ్చే స్థాయి. ఈ నేపథ్యంలోనే అఫ్జల్‌గంజ్ నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ప్రధాన రహదారి అంతా కేవలం విగ్రహాలతో తరలివెళ్లే వాహనాలకే అనుమతిస్తారు. సామాన్య ప్రజలు తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు వెళ్లేందుకు బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ కింద నుంచి మాత్రమే అనుమతి ఉంటుంది. ఇక్కడ ప్రధానంగా నిమజ్జనానికి తరలివెళ్లే వాహనాలు, సామాన్య ప్రజలు, భక్తులతో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుంది. ఇక్కడ సాఫీగా వాహనాలను వెళ్లేందుకు ట్రాఫిక్ పోలీసులు పక్కా ప్లాన్‌తో పనిచేయాల్సిన అవసరముంటుంది. ఇక్కడ సమస్య తలెత్తితే నగరవ్యాప్తంగా ప్రభావాన్ని చూపుతుంది. ఈ నేపథ్యంలోనే నిమజ్జనం సాఫీగా సాగేలా..వివిధ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో ట్రాఫిక్ అదనపు సీపీ సమీక్షలు నిర్వహిస్తున్నారు.

### 73 బేబీ పాండ్స్ వద్ద క్రేన్లు

హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ ట్యాంక్‌బండ్‌తో సహా సుమారు 62 చెరువులతో పాటు పీవోపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా 73 కొలనులను ఏర్పాటు చేసి.. ఇప్పటికే నిమజ్జన ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఆరు జోన్ల పరిధిలో స్టాటిక్ క్రేన్లు 21, మొబైల్ క్రేన్లు 295, 213 గణేశ్ యాక్షన్ బృందాలను నియమించారు. అంతేకాకుండా నిమజ్జనం అనంతరం వ్యర్థాలను తరలించేందుకు 102 మినీ టిప్పర్లు, 125 జేసీబీలను సిద్ధంగా ఉంచారు. భక్తుల సౌకర్యార్థం 309 మొబైల్ టాయిలెట్లు, 52వేల లైట్లను ఏర్పాటు చేశారు.

## అయ్యో చిట్టితల్లి..

### స్కూల్ బస్సు ఢీకొని..ఎల్‌కేజీ విద్యార్థిని మృతి

### తరగతి గదికి వెళ్తుండగా, ఘటన



మాన్విత(ఫైల్)

దుండిగల్, సెప్టెంబర్ 13: పాఠశాల స్కూల్ బస్సు ఢీకొని ఎల్‌కేజీ విద్యార్థిని దుర్మరణం పాలైంది. దుండిగల్ పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన కుంట రాజు, స్వప్నిక దంపతులు మల్లంపేటలోని డ్రీవ్ వ్యాలీ రోడ్డు పద్మజా రెసిడెన్సీలో నివాసముంటున్నారు. వీరి ఇద్దరు కుమార్తెలు స్థానిక ఓక్‌లీఫ్ హైస్కూల్‌లో చదువుతున్నారు. శుక్రవారం ఉదయం ఎల్‌కేజీ చదువుతున్న చిన్న కుమార్తె మాన్విత(3) స్కూల్ బస్సు దిగి.. తరగతి గదికి వెళ్తున్న సమయంలో అదే బస్సు తగిలి కిందపడిపోయింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని వైద్యశాలకు తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛతా హీ సేవా



సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ ) : ప్రజల భాగస్వామ్యంతో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు బల్దియా కమిషనర్ ఆమ్రపాలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు వివిధ రకాల ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించినట్లు చెప్పారు.

## చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు అప్రోచ్ రోడ్లు నిర్మించండి

### అధికారులకు సీఎం ఆదేశం

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : 'నత్తనడకన చర్లపల్లి పనులు' శీర్షికతో 'నమస్తే'లో ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు చేరుకునే విధంగా అప్రోచ్ రోడ్లను అభివృద్ధి చేయాలని మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న అటవీ శాఖ, పరిశ్రమల విభాగం భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అక్కడున్న పరిశ్రమలను మరో చోటుకు తరలించాలన్నారు.

## 22 నుంచి చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు

### నిమ్స్‌కు యూకే బృందం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిమ్స్‌లో ఉచితంగా వైద్య సేవలందించేందుకు యూకే వైద్య బృందం దవాఖానకు రానున్నదని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. యూకేలో స్థిరపడ్డ డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలో ప్రతి ఏటా వారం రోజుల పాటు నిమ్స్ భాగస్వామ్యంతో గుండె సమస్యలున్న చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 22 నుంచి 28 తేదీల్లో యూకే నుంచి డాక్టర్ రమణ నేతృత్వంలో ఫిల్ ఆర్నాల్డ్, గీతా, ఆనంద్ వాఘ్, నాగ కిశోర్, బ్రాస్ అటాండి, నిమ్స్ దవాఖాన కార్డియోథొరాసిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమరేశ్వరరావు, సీనియర్ వైద్యులు గోపాల్, వైద్య సిబ్బందితో కలిసి ఈ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. గుండె సమస్యలున్న పిల్లలు నిమ్స్ కార్డియోథోరాసిక్ విభాగం వైద్యులను సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.



వినాయకుల నిమజ్జనాలతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటున్నది. రహదారులన్నీ గణనాథుడి నామస్మరణలతో మార్మోగుతున్నాయి. చిత్రంలో నెక్లెస్‌రోడ్‌లోని సాగర్‌లో గంగా ఒడికి చేరుతున్న గణేశుడు.

## హాజరు శాతంలో హైదరాబాద్‌కు ద్వితీయ స్థానం

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



హుమాయున్ నగర్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 ( నమస్తే తెలంగాణ ) : హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరిగిందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. హుమాయున్ నగర్ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఎర్రమట్టితో గ్రీనరీ పెంచాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరుశాతంలో హైదరాబాద్ జిల్లా 67.65 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం, ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ, ప్రధానోపాధ్యాయుల కృషితో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు మరింత కృషి చేసి హైదరాబాద్‌ను మొదటిస్థానంలో నిలపాలని కోరారు. కలెక్టర్ వెంట డీఈఓ రోహిణి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చలపతి రావు తదితరులు ఉన్నారు.